క్లుప్తంగా

సూపర్ జీఎస్టీపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ రవీంద్ర

ముదిగుబ్బ: మండలంలోని ముక్తాపురం రైతు సేవా కేంద్రం వద్ద సూపర్ జీఎస్టీ– సూపర్ సేవింగ్స్‌పై శనివారం అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారి రవీంద్ర మాట్లాడుతూ వ్యవసాయ యంత్రాలు, ఇతర వృత్తుల వస్తువులపై తగ్గిన ధరల గురించి రైతులకు, ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ హరి, ఏఈఓ మనోహర్ నాయక్, రైతు సేవా కేంద్రం అధికారి అంజిబాబు, ఎంపీఈఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్: జీఎస్టీ తగ్గింపుపై శనివారం నిమ్మలకుంట గ్రామంలోని తోలుబొమ్మల కళాకారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జీఎం నాగరాజు, జీఎస్టీ అధికారి మేరువచందు, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌డీలపై అత్యధిక వడ్డీ

గాండ్లపెంట: ఖాతాదారులకు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అత్యధికంగా వడ్డీ చెల్లిస్తున్న ఏకైక బ్యాంక్ ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ అని కదిరి రీజనల్ మేనేజర్ టి.రమేష్ తెలిపారు. శనివారం ఆయన గాండ్లపెంటలోని బ్యాంకు శాఖను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఫిక్స్‌డ్ డిపాజిట్లపై సామాన్య ప్రజలకు 7.1 శాతం, సీనియర్ సిటిజన్లకు 7.6 శాతం వడ్డీ చెల్లిస్తున్నట్లు చెప్పారు. అలాగే అతి తక్కువ వడ్డీ రేటుతో గృహ, వాహన రుణాలు ఇస్తున్నామన్నారు. సూర్యఘర్ సోలార్ పథకం కింద రూ.2 లక్షల రుణాన్ని మంజూరు చేస్తున్నామని, జన్‌సమర్థ్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బ్యాంక్ మేనేజర్ మోహన్‌బాబు, ఆఫీసర్లు కె.ప్రసాద్, జి.సురేష్ పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకంతో ఆర్థిక భరోసా



మామిడి మొక్క నాటుతున్న ఎంపీడీఓ వెంకట రంగారావు

తాడిమర్రి: పండ్లతోటల పెంపకంతో ఆర్థిక భరోసా లభిస్తుందని ఎంపీడీఓ వెంకట రంగారావు రైతులకు సూచించారు. మండలంలోని ఆత్మకూరు గ్రామ రైతు ఆదినారాయణ పొలంలో శనివారం ఆయన మామిడి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు మామిడి, చీనీ, జామ, సపోటా తదితర పండ్ల మొక్కలను రాయితీపై అందిస్తోందన్నారు. మొక్కలు నాటడం నుంచి వాటికి నీరు పోయడం, కాపలా కాయడం కోసం మూడేళ్ల పాటు నెలకు కొంత డబ్బును ఇస్తుందన్నారు. ఐదెకరాలలోపు భూమి ఉన్న రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపీఓ అనిల్ కుమార్‌రెడ్డి, టీఏలు అనూరాధ, వెంకటకృష్ణ, ఎఫ్ఏ విశ్వతేజ తదితరులు పాల్గొన్నారు.


వచ్చే నెల 7 నుంచి ఉరుసు ఉత్సవాలు



పోస్టర్లు విడుదల చేస్తున్న దర్గా కమిటీ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని దర్గావీధిలో శ్రీశ్రీశ్రీ హజరత్ సయ్యద్ మెహమూద్ షా ఖాదర్‌వలి రహమతుల్లా అలైగారి దర్గా వేడుకలు, ఉరుసు ఉత్సవాలకు ప్రతిఒక్కరూ తరలిరావాలని దర్గా కమిటీ సభ్యులు కోరారు. స్థానిక దర్గాలో శనివారం ఉరుసు మహోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. నవంబర్ 7న గంధం, 8న ఉరుసు, 9న జియారత్, 10న ఫాతెహాఖాని నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే 9,10 తేదీల్లో ఖవ్వాలీ ఉంటుందన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే

తనకల్లు: మండల పరిధిలోని కొక్కంటిక్రాస్ మూడు రోడ్ల కూడలిలో శనివారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అంబేడ్కర్‌ను యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని వారు సూచించారు. దేశానికి అంబేడ్కర్ చేసిన సేవలను కొనియాడారు.

రోడ్డు ఇలా..ప్రయాణమెలా?

- ఐదు గ్రామాలకు ఒకే రోడ్డు కావడంతో నిత్యం రద్దీ
- అడుగడుగునా గుంతల మయం
- అవస్థలు పడుతున్న వాహనదారులు



గుంతల మయంగా మారిన పెద్ద ఎద్దులోళ్లపల్లి రోడ్డు



మార్పురివాండ్లపల్లి సమీపంలో అధ్వానంగా తయారైన రోడ్డు

తనకల్లు: నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే పెద్ద ఎద్దులోళ్లపల్లి– కురుమాళ్ల పల్లి రోడ్డు మార్గం గుంతలమయంగా మారింది. ఈ రోడ్డుపై వెళ్లాలంటే వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రోడ్డుపై అడుగడుగునా గుంతలు పడి అధ్వానంగా తయారైంది. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు గుంతలను గమనించక ప్రమాదాలకు గురవుతున్నారు.

పట్టించుకోని అధికారులు

చీకటిమానిపల్లి వద్ద ఉన్న జాతీయ రహదారి– 42 (బొంతలపల్లి క్రాస్) నుంచి పెద్ద ఎద్దులోళ్లపల్లి, చిన్న ఎద్దులోళ్లపల్లి, మార్పురివాండ్లపల్లి, రాగినేపల్లి మీదుగా కురవాండ్లపల్లి వరకు దాదాపు నాలుగు కిలోమీటర్ల మేర గతంలో తారురోడ్డు వేశారు. ప్రస్తుతం ఇది పెద్ద పెద్ద గుంతలు పడి, కంకర తేలిపోయింది. కనీసం నడవడానికి కూడా అవస్థలు పడాల్సి వస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు మరింత అధ్వానంగా తయారైంది. వేరే మార్గం లేకపోవడంతో ఈ రోడ్డుపైనే అతి కష్టంగా ప్రయాణాలు చేస్తున్నారు. రోడ్డు సమస్యను ఇప్పటికే ఎన్నోసార్లు అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ప్రయోజనమూ లేకపోయిందని ప్రజలు వాపోతున్నారు.

అవస్థలు పడుతున్నాం



బొంతలపల్లి క్రాస్ నుంచి కురవాండ్లపల్లి వరకు రోడ్డుపై ఎక్కడ చూసినా పెద్ద పెద్ద గుంతలే కనిపిస్తున్నాయి. ప్రధానంగా ఆటోలు, ద్విచక్ర వాహనాలు గుంతల్లో ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ రోడ్డుపై రోజూ ఏదో ఒక ప్రమాదం జరుగుతూనే ఉంది. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారిలో ఎలాంటి చలనమూ లేదు. ఇప్పటికైనా స్పందించి రోడ్డు మరమ్మతు చేయాలి. – సర్వేశ్వర్‌రెడ్డి, పెద్ద ఎద్దులోళ్లపల్లి, తనకల్లు మండలం

ఒళ్లు హూనమే



మా ఊరి రోడ్డుపై ప్రయాణం చేస్తే ఒళ్లు హూనమే! ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంది. వర్షాలకు రోడ్డంతా గుంతలు పడి పాడైపోయింది. ఇప్పటికే ఎన్నో ప్రమాదాలు జరిగాయి. అధికారులు తక్షణం స్పందించి రోడ్డును అభివృద్ధి చేయాలి. – కొండయ్య, రాగినేపల్లి, తనకల్లు మండలం

అర్హులందరికీ పథకాలు అందాలి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అంజలి

చెన్నేకొత్తపల్లి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని ఎంపీపీ అంజలి అధికారులకు సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అంజలి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. తొలుత అధికారులు వారి శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. అనంతరం పలువురు సర్పంచ్‌లు మాట్లాడుతూ...తమను గ్రామ సభలకు ఆహ్వానించడం లేదని, గ్రామ ప్రథమ పౌరులమైన తమకే ఆహ్వానం అందకపోతే ఎలా అని అధికారులను నిలదీశారు. ఇక పనులకు సంబంధించిన బిల్లులు చేయాలని పంచాయతీ కార్యదర్శులను అడిగితే... వారు ఈఓఆర్డీని అడగాలని చెబుతూ కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పూర్తయిన పనులకు సంబంధించిన బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు.

అధికారుల స్థానంలో సిబ్బంది హాజరు

ప్రతి మూడు నెలలకు ఒకసారి మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చిస్తారు. ఈ సమయంలో ఏదైనా శాఖకు సంబంధించి సభ్యులకు ఏదైనా అనుమానం ఉంటే సదరు శాఖ అధికారి అక్కడే నివృత్తి చేయాల్సి ఉంటుంది. ఇంతటి కీలకమైన సమావేశానికి అధికారులు డుమ్మా కొడుతున్నారు. శనివారం జరిగిన సమావేశానికి కొన్ని శాఖల అధికారులు తమ కింది స్థాయి సిబ్బందిని పంపారు. దీంతో తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు ఆ మాత్రం సమయం లేదా అని ప్రశ్నించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు గోవిందరెడ్డి, ఎంపీడీఓ బాలకృష్ణుడు, తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంఈఓలు మున్వర్‌బాషా, ప్రసూన్ కుమార్ నాయుడు, ఏఓ మురళీకృష్ణ, ఈఓఆర్డీ అశోక్‌నాయక్‌తోపాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించని సమావేశాలెందుకు?



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాము

ఎన్పీకుంట: సమస్యలపై చర్చించి, వాటికి పరిష్కారం చూపని సమావేశాలు నిర్వహించడం ఎందుకని ఎంపీపీ ఈటెరాము, కోఆప్షన్ సభ్యుడు సుబహాన్ అధికారులను ప్రశ్నించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోఆప్షన్ సభ్యుడు సుబహాన్ మాట్లాడుతూ మండల కేంద్రంలో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుండటంతో డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని గత సమావేశాల్లో పలుమార్లు తీర్మానం చేసినా అమలుకు నోచుకోలేదన్నారు. ఈ తీర్మానాలను సంబంధిత అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లలేదన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలని కోరారు. మండల కేంద్రంలోని పలు వీధులలో సోలార్ వీధిదీపాలు వెలగడం లేదని, వాటికి మరమ్మతులు చేపట్టాలని కోరారు. మండలంలోని సోలార్ పవర్‌ప్లాంట్ ద్వారా విడుదలయ్యే కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులను పక్క జిల్లాలకు మళ్లిస్తున్నారని, వాటిని మండలాభివృద్ధికి ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఈటె రాము అధికారులకు సూచించారు. మరి కొమ్మదిన్ని సమీపంలో ప్రధాన రహదారిపై వంతెన దెబ్బతిందని, వర్షాలు పడినప్పుడు రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోందని స్థానిక ఎంపీటీసీ సభ్యుడు తిమ్మారెడ్డి సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వంతెనను పునర్నిర్మించి సమస్య పరిష్కరించాలని కోరారు. పెడబల్లిలో 10 మంది రైతులు సుమారు 70 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఏళ్లుగా సాగు చేస్తున్నారని, వీరికి పట్టాలు మంజూరు చేయాలని ఎంపీటీసీ సభ్యురాలు సరస్వతి కోరారు. సమావేశానికి హాజరుకాని అధికారులకు మెమోలు జారీ చేసి..శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీఓ పార్థసారథి, తహసీల్దార్ దేవేంద్రనాయక్, వైస్‌ఎంపీపీ సంపూర్ణ, గిరిజన సలహా మండలి సభ్యులు సోమ్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

శోభాయమానంగా దుర్గామాత గ్రామోత్సవం



లింగారెడ్డిపల్లిలో దుర్గామాత గ్రామోత్సవం



ధర్మవరంలో దుర్గమ్మ విగ్రహ నిమజ్జన దృశ్యం

బత్తలపల్లి: మండలంలోని లింగారెడ్డిపల్లిలో దసరా ఉత్సవాల సందర్భంగా శనివారం దుర్గామాత గ్రామోత్సవం శోభాయమానంగా నిర్వహించారు. డప్పులు, భజనలు, కోలాటాలు, మహిళల హారతులు ఉత్సవ వాతావరణాన్ని మరింత ఆహ్లాదకరంగా మార్చాయి. ఈ వేడుకలను తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

ధర్మవరం అర్బన్: పట్టణంలోని స్వయంభు కాలభైరవస్వామి ఆలయంలో దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా దుర్గమ్మ విగ్రహానికి ప్రతిరోజూ వివిధ అలంకరణలతో పూజలు చేశారు. పూజారి ధనుంజయ ఆచారి ఆధ్వర్యంలో అమ్మవారికి నిత్య పూజలు చేపట్టారు. శనివారం అమ్మవారి నిమజ్జనోత్సవం సంగమేశ్వరం నది వద్ద వైభవంగా నిర్వహించారు.

- ధర్మవరం పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో శనివారం అమ్మవారికి పుష్పాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. శరన్నవరాత్రుల ముగింపు సందర్భంగా మూలవిరాట్‌కు అర్చకులు చంద్రశేఖర్‌శర్మ, నారాయణశాస్త్రి ఆధ్వర్యంలో అభిషేకాలు చేశారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు, వాసవీ మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా చిన్నకుళ్లాయిస్వామి ఉరుసు



చిన్నకుళ్లాయిస్వామి ఉరుసు పీరును ఊరేగిస్తున్న భక్తులు

ఎన్పీకుంట: మండల పరిధిలోని వెలిచలమల గ్రామంలో శనివారం చిన్నకుళ్లాయిస్వామి ఉరుసు పీరు మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం పేటబావి వద్ద నుంచి చిన్నకుళ్లాయి స్వామి ఉరుసు పీరును డప్పు, వాయిద్యాలు, మేళతాళాలతో జనసందోహం మధ్య ఊరేగింపుగా తీసుకొచ్చి పీర్లచావిడిలో కొలువు దీర్చారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారికి చక్కెర చదివింపులు చేయించారు. మొక్కుబడులు తీర్చుకున్నారు. పానకం దుత్తలు, గంధం ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు బోరెడ్డి కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆదివారం తెల్లవారుజామున స్వామి వారి అగ్నిగుండ ప్రవేశంతో కార్యక్రమం ముగుస్తుంది.

మంచి ఆహారంతోనే ఆరోగ్యం



బత్తలపల్లిలో మాట్లాడుతున్న సీడీపీఓ సరస్వతి



పుట్టపర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

బత్తలపల్లి: మంచి ఆహారంతోనే ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ సీడీపీఓ సరస్వతి అన్నారు. శనివారం మండలంలోని మాల్యవంతం గ్రామంలో ఒకటో అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ మహా కార్యక్రమాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎర్రమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీడీపీఓ సరస్వతి మాట్లాడుతూ ఆయిల్, ఉప్పు, చక్కెర తక్కువగా వాడాలని సూచించారు. చిరుతిండ్లు, జంక్‌ఫుడ్ తగ్గిస్తే ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. అలాగే బీపీ, షుగర్, ఊబకాయం బారినపడకుండా ఉంటారన్నారు. గర్భిణులు, బాలింతలు సరైన పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అలాగే పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలంటూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, గ్రామంలోని గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: పౌష్టికాహారంతోనే ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రమ్మ అన్నారు.ముదిగుబ్బ అంగన్‌వాడీ కేంద్రం–2లో శనివారం పోషణ్ మహా వేడుకను ఘనంగా నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు.

పుట్టపర్తి అర్బన్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండడానికి పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ జయంతి, సూపర్‌వైజర్ సుజాత సూచించారు. శనివారం పుట్టపర్తి మండలం పెడపల్లిలో పోషణ్ మహా, స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర, పోషణ్ పక్వాడ, బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాహారం ప్రాముఖ్యతను తెలియజేయాలన్నారు. గ్రామస్తులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. మొక్కలు నాటారు. అంగన్‌వాడీ కార్యకర్తలు రేణుక, అనిత, భగవతి, అరుణ, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలపై సమాచారమివ్వండి

కదిరిఅర్బన్: చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ప్రజలు సమాచారం ఇవ్వాలని డీఎస్పీ శివనారాయణస్వామి సూచించారు. మండల పరిధిలోని రాచువారిపల్లి తండాలో శనివారం డీఎస్పీ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో ఎక్కడైనా గంజాయి అమ్మడం, సేవించడం ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. మహిళలపై దాడులు, చిన్నపిల్లలపై నేరాలకు పాల్పడే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం గ్రామస్తులకు చట్టాలపై అవగాహన కల్పించారు. రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐ నిరంజన్ రెడ్డి, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళలపై గౌరవభావం కలిగి ఉండాలి

ధర్మవరం రూరల్: మహిళల పట్ల గౌరవ భావంతో ఉండాలని ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్ ప్రజలకు సూచించారు. శనివారం మండల పరిధిలోని కుణుతూరు గ్రామంలో సమావేశాన్ని నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ చిన్న పిల్లలపై నిఘా ఉంచి.. వారిపై జరిగే నేరాలను అరికట్టాలన్నారు. గొడవలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరమన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

తనకల్లు: నేరాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ గోపి హెచ్చరించారు. మండల పరిధిలోని బాలసముద్రంలో శనివారం రాత్రి గ్రామస్తులకు చట్టాలపై అవగాహన కల్పించారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్టాపనోత్సవం



ఆలయం ఎదుటప్రతిష్ఠించిన ధ్వజస్తంభం



కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి శంకరనారాయణ

బత్తలపల్లి: మండలంలోని గంటాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం ఎదుట ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శనివారం వైభవోపేతంగా నిర్వహించారు. వేదపండితులు పార్థసారథి శర్మ ఆధ్వర్యంలో 11 మంది వేదపండితులు, దేవాలయ అర్చకులు గోపాలు, ధ్వజస్తంభం దాతలు జాంపుల వెంకటరాముడు కుమారులు వెంకటేష్, జయరాములు, శ్రీనివాసులు తమ కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో కలిసి దేవాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం రెండు క్రేన్ల సహాయంతో 39 అడుగుల ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠింపజేశారు. సాయంత్రం మూలవిగ్రహాల గ్రామోత్సవం, శిఖర కలశస్థాపన, ఇతరత్రా కార్యక్రమాలను నిర్వహించి.. తీర్థప్రసాదాలను అందజేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవానికి మాజీ మంత్రి శంకరనారాయణ హాజరయ్యారు. మనిషి జీవితంలో దైవకార్యం ఎంతో పవిత్రమైనదని ఆయన అన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కమతం ఈశ్వరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కోటి సురేష్‌కుమార్, నాయకులు కొంకా ప్రసాద్, వ్యాపారం పెద్దప్ప తదితరులు ఉన్నారు. అలాగే హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి కూడా పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

8 నుంచి ఆధార్ క్యాంపులు

కదిరి అర్బన్: జాతీయ తపాలా వారోత్సవాల సందర్భంగా ఈ నెల 8 నుంచి 14వ తేదీ వరకు కదిరి డివిజన్ అంతటా పోస్టాఫీసుల్లో ఆధార్ నమోదు, అప్‌డేట్ సేవలను అందిస్తున్నట్లు పోస్టల్ ఇన్‌స్పెక్టర్ గోవర్ధన్ నాయక్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

బత్తలపల్లి: తపాలా వారోత్సవాలలో భాగంగా ధర్మవరం డివిజన్ అంతటా ఈ నెల 8వ తేదీ నుంచి 14 వరకు ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రాజేష్ తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు తపాలా వారోత్సవాలు జరుగుతాయన్నారు.

ఎక్స్‌ప్రెస్ సర్వీసులను పునరుద్ధరించండి

ఎన్పీకుంట: గాండ్లపెంట, ఎన్పీకుంట, గాలివీడు మండలాల మీదుగా గతంలో ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో నడిచిన ఎక్స్‌ప్రెస్ సర్వీసులను తిరిగి ప్రారంభించాలని మండల కేంద్రానికి చెందిన ఎస్.శివనాగిరెడ్డి అనే యువకుడు శనివారం ఎంపీపీ ఈటెరాము, తహసీల్దార్ దేవేంద్రనాయక్, ఎంపీడీఓ పార్థసారథిలకు వినతిపత్రం అందించారు. కరోనాకు ముందు కదిరి నుంచి ఈ మూడు మండలాల మీదుగా కడప, తిరుపతి, చెన్నై, బెంగళూరు, నంద్యాల వంటి పట్టణాలకు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నడిచాయని గుర్తు చేశారు. అయితే రహదారి పరిస్థితి దయనీయంగా మారడంతో ఆర్టీసీ అధికారులు ఈ సర్వీసులను రద్దు చేశారన్నారు. ప్రస్తుతం కదిరి– రాయచోటి మధ్య డబుల్‌లేన్ అందుబాటులోకి రావడంతో ఎక్స్‌ప్రెస్ సర్వీసులను పునరుద్ధరించాలని కోరారు.

వేరుశనగలో పంట కోత ప్రయోగాలు



వేరుశనగలో పంట కోత ప్రయోగాలు చేస్తున్న దృశ్యం

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని రావులచెరువు గ్రామంలో శనివారం వేరుశనగలో పంట కోత ప్రయోగాలను మండల సహాయ గణాంకాధికారి కేఎస్ఎల్ఎన్ శర్మ ఆధ్వర్యంలో చేపట్టారు. సర్వే నంబర్ 179–3సీలోని డి.ఓబిరెడ్డి పొలంలో 3కేజీల 300 గ్రాములు, సి.నల్లపురెడ్డి పొలంలో 3 కేజీల 300 గ్రాముల దిగుబడి వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్ఏ రాజశేఖర్, రైతులు మురళీ మోహన్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

శుభకార్యం

తాడిమర్రి: మండలంలోని కాటికోటేశ్వర క్షేత్రంలో శనివారం జరిగిన చిల్లవారిపల్లికి చెందిన ఆంధ్ర సుబ్బారెడ్డి కుమారుడు ఆంధ్ర వెంకట కృష్ణారెడ్డి వివాహ వేడుకల్లో డీసీఎంఎస్ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డితో పాటు పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, గ్రామ సర్పంచ్ పిట్టు పెద్ద శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడ: మండలంలోని కుటాలపల్లికి చెందిన దాసరి ఆదినారాయణరెడ్డి కుమారుడు నిశాంత్‌రెడ్డి వివాహం వధువు కోహిణితో శనివారం జరిగింది. మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తండ్రి, రెస్కో మాజీ చైర్మన్ దుద్దుకుంట వెంకట్రామిరెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిట్టిబాల ఆదినారాయణ రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పొరకల రమణ, నాయకులు సూర్యనారాయణరెడ్డి, కుళ్లాయినాయక్, చంద్రహాసరెడ్డి, మాధవరెడ్డి, తిరుపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థికసాయం



నగదు అందిస్తున్న పద్మశాలీయ సంఘం నాయకులు

ధర్మవరం అర్బన్: అనారోగ్యంతో బాధపడుతున్న పద్మశాలీయ కులస్తులకు బహుత్తమ పద్మశాలీయ సంఘం నాయకులు ఆర్థికసాయం అందించారు. శనివారం పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన జక్కా శ్రీనివాసులు, కాకి మోహన్, గొట్లూరు గ్రామానికి చెందిన అవ్వారు రామాంజినేయులు, లక్ష్మీనగర్‌కు చెందిన జింకా నారాయణస్వామిలకు ఒక్కొక్కరికి రూ.10116 చొప్పున మొత్తం రూ.40464 నగదు అందించారు. సంఘం అధ్యక్షుడు పుత్తా రుద్రయ్య, ఉపాధ్యక్షుడు జింకా నాగభూషణ, కోశాధికారి బాల కుళ్లాయప్ప, సభ్యులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు అందరి సహకారం అవసరం



మాట్లాడుతున్న స్వయం సేవక్ ప్రముఖులు

ధర్మవరం: హిందూ ధర్మ పరిరక్షణకు అందరి సహకారం అవసరమని ప్రధానవక్త శింగనమల శివకిషోర్, వ్యాయామ ఉపాధ్యాయుడు బద్దెల శివకృష్ణ అన్నారు. పట్టణంలోని రాఘవేంద్రస్వామి కల్యాణ మండపంలో శనివారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) శతాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో మంచి పరివర్తన తీసుకుని రావాలని, కుటుంబ విలువలు పెంచాలని అన్నారు. హిందూ ధర్మాన్ని ప్రతిఒక్కరూ పాటించాలన్నారు. అన్ని కులాలు ఒక్కటే అన్నారు. వాటి మధ్య సామాజిక సామరస్యాన్ని కలిగి ఉండాలన్నారు. స్వదేశీ ఉత్పత్తులను వాడాలని సూచించారు. ప్రజలందరూ దేశ భక్తి అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ విభాగ్ ప్రచార ప్రముఖ్ వివేకానంద, జిల్లా సహ కార్యవాహ్ శరత్‌బాబు, ఉపాధ్యాయ ప్రముఖ్ అన్నం అరవింద్, స్వయం సేవక్ సభ్యులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి గర్భగుడికి అష్టకప్పులు

తాడిమర్రి: మండలంలోని మర్రిమాకులపల్లి ఓసీ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న అభయాంజనేయ స్వామి గర్భగుడికి శనివారం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో అష్టకప్పులు (మూత) వేశారు. ముందుగా అష్టకప్పులకు కొబ్బరి కాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ గర్భగుడిపై ఎనిమిది రాయిపండలను (అష్టకప్పులు) నిర్మించారు. గ్రామస్తులు ఆలయ నిర్మాణ కళాకారులకు నూతన వస్త్రాలను దానం చేశారు.